
నిర్వీర్యం

వెలంపేట సచివాలయం



ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయం



సచివాలయ వ్యవస్థకు తూట్లు

అటకెక్కిన పలు సేవలు

తలలు పట్టుకుంటున్న లబ్ధిదారులు

ప్రజల ముంగిటకే పాలన అనే నినాదంతో నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ అందుబాటులో ఉండే విధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ప్రజల అవసరాలను తీరుస్తూ సుపరిపాలన అందించారు. విద్య, వైద్యం, జనన, మరణాల వంటి ప్రజల నిత్య జీవితంతో ముడి పడే ప్రతి అంశాన్ని సచివాలయ వ్యవస్థతో అనుసంధానం చేస్తూ.. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగే అవసరం లేకుండా వారి ముంగిటే అన్నీ అందేలా చర్యలు తీసుకున్నారు.

జగదాంబ: గతంలో ఒక వెలుగు వెలిగిన సచివాలయ వ్యవస్థ నేడు నిర్వీర్యం అవుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని.. అక్కడికి వెళ్లినా వెంటనే పనవుతుందన్న నమ్మకం ఉండేది కాదని చెబుతున్నారు. సచివాలయాలు వచ్చాక ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థులకు కావాల్సిన పథకాలు, ఆధార్ నమోదు, తప్పొప్పుల సవరణ వంటి అనేక పనులు సులువుగా అయ్యేవని పేర్కొంటున్నారు. దీంతో ఎప్పుడు చూసినా సచివాలయాలు లబ్ధిదారులతో కళకళలాడేవని.. ఇప్పుడు అనేక సేవలు లేక వెలవెలబోతున్నాయంటున్నారు.

వాట్సప్‌కు ధ్రువపత్రాలు

జోన్–4 పరిధిలోని 68 సచివాలయల్లో దాదాపుగా 140 కంప్యూటర్లు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా పని చేయడం లేదు. స్టేషనరీ, స్కానింగ్, జిరాక్స్ వంటి సదుపాయాలు అటకెక్కడం వల్ల కొన్ని సచివాలయాల్లోని కార్యదర్శులు పీడీఎఫ్ ద్వారా లబ్ధిదారులు కోరిన ధ్రువపత్రాలు వాట్సప్‌కు పంపుతున్నారు. వాటిని లబ్ధిదారులు బయట ప్రింట్ చేసి తీసుకొస్తే సంతకాలు చేసి, స్టాంప్ వేసి ఇస్తున్నారు.

రూ. వెయ్యి ఇస్తున్నారు..

సచివాలయాల్లో పేపర్లు, పిన్నులు, పెన్నులు, ప్రింటర్లు, ఫైల్స్ వంటి స్టేషనరీ సామగ్రి కోసం గ్రామ, వార్డు సచివాలయ డిపార్టుమెంట్ నిధులు మంజూరు చేయాల్సి ఉంటుంది. వారు నెలకు రూ. 1000 మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీని వల్ల అన్ని సచివాలయాల అడ్మిన్లతో పాటు వివిధ సెక్షన్ల కార్యదర్శులు వారి జేబులో నుంచి పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. అప్పటికీ చాలకపోవడంతో సచివాయాలకు వచ్చే ప్రజలు నిర్ణీత సమయంలో పనులు పూర్తి కాక నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని వాపోతున్నారు.

స్టేషనరీ లేక ఇక్కట్లు..

దక్షిణ నియోజకవర్గంలోని జోన్–4లో మొత్తం 68 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో కొన్ని సచివాలయాల్లో కంప్యూటర్, స్కానర్లు ఉన్నాయి తప్ప వాటికి కావల్సిన స్టేషనరీ లేకపోవడంతో సచివాలయానికి వచ్చే ప్రజలకు వాట్సప్‌లలో పీడీఎఫ్ మెసేజీలు పంపించాల్సి వస్తోంది. వాటిని బయట జిరాక్స్ సెంటర్ల వద్ద ప్రింట్లు తీసుకోవాలని చెబుతున్నారంటే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏ మేరకు సేవలందిస్తుందో అర్థం చేసుకోవచ్చని లబ్ధిదారులు వాపోతున్నారు. కొన్ని సచివాలయాల్లో కనీసం దరకాస్తులు కూడా లేవంటే ఇంకేం చెబుతామంటున్నారు. ఈ వ్యవహారం సచివాలయ సెక్రటరీలకు తలనొప్పిగా తయారైందని చెప్పడం అతిశయోక్తి కాదు.

బిల్లు పెడితే ఇస్తాం..



కమిషనర్ నగదు విడుదల చేశారు. అన్ని సచివాలయాలకు రూ. వెయ్యి ఇస్తున్నాం. పెన్నులు, పిన్నులు, పేపర్ల వంటి వాటి కోసం రూ. వెయ్యి సరిపోతుంది. ప్రింటర్లు, కాట్రిజ్‌లు, పెద్ద వస్తువులు జీవీఎంసీ సరఫరా చేస్తుంది. వాస్తవంగా సెక్రటరీలు నెలకు ఇచ్చే రూ. వెయ్యి కోసం బిల్లు పెట్టాల్సి ఉంది. కానీ కొన్నిసార్లు అలా జరగడంలేదు. ఇప్పటి నుంచి ప్రతి నెల తప్పనిసరిగా బిల్లు పెట్టాలని ఆదేశించాం.

– ఎం.మల్లయ్యనాయుడు, జీవీఎంసీ జోన్–4 కమిషనర్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న కొల్లా సతీష్‌కుమార్

డాబాగార్డెన్స్: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఎలియన్స్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ కొల్లా సతీష్‌కుమార్ అభిలషించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం 2024–25 విద్యార్థులను సీనియర్లు ఆహ్వానిస్తూ నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఉల్లాసంగా సాగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ 2003 నుంచి ఏటా పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. రాష్ట్రంలోని హోటల్ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించిన తొలి సంస్థ తమదేనన్నారు. యువతకు ఉద్యోగ కల్పనతో పాటు మంచి భవిష్యత్ అందివ్వడమే తమ లక్ష్యమన్నారు. సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్, అధ్యాపకుడు వీఎస్‌వీ శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల, విద్యార్థుల విజయానికి వ్యక్తిత్వ వికాస తరగతులు వంటివి దోహదం చేస్తాయని, మేనేజ్‌మెంట్ గేమ్స్ నిర్వహణ ద్వారా విద్యార్థులకు ఉపశమనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ కార్తికేశ్వర్ పండా, ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎ. శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 19వ రోజు శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం 5 నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, సర్వదర్శనం, పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సర్వదర్శనం, విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. క్షీరాభిషేక సేవలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ఆలయంలో అన్నదానం

మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు జ్ఞాపికల బహూకరణ



మెమెంటోలతో పాఠశాలల ప్రతినిధులు, బాలోత్సవం నిర్వాహకులు

డాబాగార్డెన్స్: గత నెల 19, 20, 21 తేదీల్లో నగరంలోని సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల వేదికగా నిర్వహించిన బాలోత్సవంలో పాల్గొన్న పాఠశాలలకు శుక్రవారం జ్ఞాపికలు అందజేశారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బాలోత్సవం అధ్యక్షుడు రఘు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె. రమాప్రభ, సీహెచ్ సత్యనారాయణ పాల్గొని విశాఖ బాలోత్సవం నిర్వహించిన తీరు వివరించారు. అందుకు సహకరించిన పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ రత్నకుమార్, స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. 25 పాఠశాలల నుంచి పాల్గొన్న ప్రతినిధులకు మెమెంటోలు అందజేశారు.

పీజీ వైద్య విద్యార్థికి గోల్డ్ మెడల్



డాక్టర్ శ్రావణ్ కుమార్‌కు గోల్డ్ మెడల్ అందజేస్తున్న డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: ప్రసాద్‌లాల్ గోల్డ్ మెడల్ విజేత డాక్టర్ శ్రవణ్ కుమార్‌కు శుక్రవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మెడల్ ప్రదానం చేశారు. డాక్టర్ ప్రసాద్ లాల్, శ్రీమతి లక్ష్మీలాల్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మెడల్‌ను ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రసాద్ లాల్, శ్రీమతి లక్ష్మీలాల్ ప్రవేశపెట్టారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ/కింగ్ జార్జ్ హాస్పిటల్ కార్డియాలజీ విభాగం 2024 సంవత్సరానికి గాను ఎండీ జనరల్ మెడిసిన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ల కోసం క్లినికల్ కార్డియాలజీ గోల్డ్ మెడల్ పరీక్ష నిర్వహించాయి. కార్డియాలజీ రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన వైద్య విద్యార్థులకు ఈ బంగారు పతకం ఇవ్వాలని డాక్టర్ ప్రసాద్‌లాల్ నిర్ణయించారు. అందులో భాగంగా ప్రతి ఏడాది ఈ పరీక్ష నిర్వహించి, అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సూపరింటెండెంట్ హెన్న నేతృత్వంలో అధికారులు, ఉద్యోగులు కలిసి నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కమిషనర్ సంపత్‌కుమార్, అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, పలువురు అధికారులు పాల్గొని క్రైస్తవ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మంచి చేయడం, ప్రేమ, దయ, క్షమాగుణం అనేవి బైబిల్ ద్వారా ఏసుక్రీస్తు చెప్పారని, ఈ క్రిస్మస్ పండగ అందరిలోనూ వెలుగులు నింపాలని తెలిపారు. కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ అందరికీ క్రిస్మస్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరై జీవీఎంసీలో ఈ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మాట్లాడుతూ శత్రువుల్ని కూడా ప్రేమించండని యేసు ప్రభువు చెప్పిన వ్యాఖ్యల్ని గుర్తు చేశారు. ఉద్యోగులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణ, పర్యవేక్షక ఇంజినీర్ సంపత్‌కుమార్, ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలోనే ఈఎస్ఐ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

డాబాగార్డెన్స్: విశాఖలోనే ఈఎస్ఐ మెడికల్ కాలేజీ పెట్టాలని, 14 లక్షల మంది ఈఎస్ఐ సభ్యులు ఉన్న ఉత్తరాంధ్రలో కాకుండా అమరావతిలో ఈఎస్ఐ మెడికల్ కాలేజీ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని సిటు ఏపీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పేర్కొన్నారు. జగదాంబ జంక్షన్ సమీపాన గల పార్టీ కార్యాలయంలో శుక్రవారం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, కోశాధికారి ఎస్. జ్యోతీశ్వరరావుతో కలిసి మీడియా సమావేశంలో నరసింగరావు మాట్లాడారు. 500 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి విశాఖలోని షీలానగర్‌లో నిర్మాణం అవుతుందని, అక్కడే మెడికల్ కాలేజీ పెట్టడం సరైందని సిటు భావిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ అంటే అమరావతి మాత్రమే అనే విధానాన్ని సంకీర్ణ ప్రభుత్వం అమలు చేస్తోందని, ఇది సరైన విధానం కాదన్నారు. ఎన్నికలకు ముందు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయిస్తామని, సొంత గనులు సమకూరుస్తామని వాగ్దానం చేసినప్పటికీ తెలుగుదేశం ప్రభుత్వం ఆ హామీని అమలు చేయలేదన్నారు. విశాఖ స్టీల్‌ను అప్పుల్లో ముంచి, ప్రైవేట్‌కు అప్పజెప్పాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడకుండా, ఆర్సీ మిట్టల్‌తో నక్కపల్లిలో స్టీల్‌ప్లాంట్‌ను ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 30 ఏళ్ల నుంచి నడుస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే బాధ్యత టీడీపీ ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. ప్రైవేట్ పిచ్చితో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, 2014–2019 కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం పారిశ్రామికవేత్తలతో చేసిన ఒప్పందాల్లో 5 శాతం కూడా అమలు కాలేదన్నారు. నేడు మరలా ప్రైవేట్ పారిశ్రామికవేత్తలతో ఆర్భాటంగా చేసే ఒప్పందాలకు విలువెంత? అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వచ్చే ఐదేళ్లలో ఆర్టీసీలో 12700 బదులు విద్యుత్ బస్సులు కొంటున్నట్టు ప్రకటించిందని, ఒక్కో బస్సును రూ.2 కోట్లకు కొని ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పజెప్పాలని పథకం తయారు చేశారన్నారు. ఆర్టీసీని ధ్వంసం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ కుట్రను సిటు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోనే అతి చౌకగా విద్యుత్ యూనిట్‌కు 4.50 పైసలు అందించే చండీఘర్ రాష్ట్ర విద్యుత్ సంస్థను ప్రైవేట్‌కు అప్పగించాలని ఈ నెల 4న నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. దీనికి నిరసనగా దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు ఈ నెల 25న చలో చండీఘర్‌కు పిలుపునిచ్చాయన్నారు. అదే రోజున ఆంధ్రప్రదేశ్‌లో నిరసన తెలియజేయాలని కార్మిక వర్గానికి సిటు పిలుపునిస్తోందన్నారు.

పదిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ఉపాధ్యాయులతో సమావేశమైన జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్‌కుమార్

అల్లిపురం: డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు తరగతులు జరిగే విధానాన్ని పర్యవేక్షించారు. పిల్లల నోట్ బుక్స్‌ను పరిశీలించారు. పలు సబ్జెక్టులపై ప్రశ్నించారు. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల్లో ఉత్తమ అభ్యసన ఫలితాల సాధనకు తగ్గట్టుగా బోధన ఉండాలన్నారు. వంద రోజుల ప్రణాళికను అమలు చేయాలని ఆదేశించారు. ఉత్తీర్ణతా శాతం పెంపుదలకు అవసరమైన సూచనలు అందించారు. విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం తినేలా, వారికి పోషణ అందేలా చూడాలని సూచించారు.

మిషన్ శక్తి పథకంపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

మహారాణిపేట: మిషన్ శక్తి పథకం అమలులో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా స్థాయి మిషన్ శక్తి కమిటీ సమావేశం జరిగింది. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పలు అంశాలపై చర్చించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ పీడీ జయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



మిరపకాయల వీధిలో డ్రైనేజీలో మంచినీటి పైపులైను



కుమ్మరవీధిలో మంచి నీటి పైపులైన్‌పై నిర్మించిన విద్యుత్ డీబీ బాక్సు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ వార్డు మాజీ కార్పొరేటర్ పచ్చిరిపల్లి లక్ష్మి శుక్రవారం జోన్–4 జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వార్డులోని మిరపకాయల వీధిలో డ్రైనేజీలో మంచినీటి పైపు లైన్ పగిలిపోవటంతో స్థానికులు మంచినీటికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తక్షణమే కాలువలో గల పైప్‌లైన్‌ను తొలగించాలని కోరారు. అదే విధంగా కుమ్మర వీధిలో మంచినీటి పైపు లైను పైనే విద్యుత్ డీబీ బాక్సు వేశారని, దీని వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన జెడ్సీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆమెకు హామీ ఇచ్చారు.

జోన్–4 పన్ను వసూళ్లు రూ. 30 లక్షలు



జెడ్సీకి చెక్ అందిస్తున్న ఆర్‌వో, ఆర్ఐలు

జగదాంబ: జీవీఎంసీ జోన్–4కు రూ. 30 లక్షల ఆదాయం సమకూరింది. జోన్ పరిధిలో 31, 33 వార్డుల్లో రెవెన్యూ అధికారులు ఆర్‌వో అప్పలరాజు, ఆర్ఐ సీతారాం వాణిజ్య సముదాయాల ద్వారా పన్నులు వసూలు చేసి జీవీఎంసీకి ఆదాయాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా చెక్‌ను జోనల్ కమిషనర్‌కు అందజేశారు. అనంతరం జెడ్సీ మల్లయ్యనాయుడు మాట్లాడుతూ అన్ని వార్డుల నుంచి పాతబకాయిలు వసూలు చేయాలన్నారు. గతంలో పేరుకుపోయిన బకాయిలకు ముందుగా నోటీసులు జారీ చేయాలన్నారు. తర్వాత వసూలు చేయాలని, చెల్లించని పక్షంలో ఆయా ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇంటి, నీటి, ఖాళీ స్థలాల పన్నుల వసూలు వేగవంతం చేయాలన్నారు. రూ. 30 లక్షలు వసూలు చేసిన ఆర్‌వో అప్పలరాజు, ఆర్ఐ సీతారామ్‌ను జెడ్సీ అభినందించారు.

తండ్రి చెంతకు కుమారుడు



అనిల్‌కుమార్‌ను తండ్రికి అప్పగిస్తున్న ఏయూటీడీ సెక్రటరీ ప్రగడ వాసు

సీతమ్మధార: బీహార్‌లోని జెహనాబాద్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్ (40)ని తండ్రి సర్జు యాదవ్‌కు విశాఖ రప్పించి వసతిగృహ నిర్వాహకులు అప్పగించారు. ఏయూటీడీ సెక్రటరీ ప్రగడ వాసు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. అనిల్‌కుమార్‌కు సరిగ్గా కనిపించదు. రైల్వే స్టేషన్‌లో అతన్ని వివరాలు అడిగితే బెంగళూరులో ఒక సంవత్సరం పాటు పని చేసి వైజాగ్ వచ్చానని చెప్పాడు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడించడంతో భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు.

సీపీఐని సామాన్యులకు చేరువ చేద్దాం

పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి



కమ్యూనిజం ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి తదితరులు

అల్లిపురం: భారత కమ్యూనిస్టు పార్టీని సామాన్య జనానికి మరింత చేరువ చేద్దామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ చరిత్రను, పోరాటాల వివరాలతో రూపొందించిన కమ్యూనిజం మాసపత్రిక ప్రత్యేక సంచికను ఆయన శుక్రవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భావం నుంచి నేటి వరకు పార్టీ సాధించిన విజయాలు అనన్య సామాన్యమైనవన్నారు. దేశంలో సమ సమాజ నిర్మాణం కోసం సీపీఐ నిరంతరం పని చేస్తుందన్నారు. సీపీఐ పోరాటాలను మరోసారి మననం చేయడం లక్ష్యంగా కమ్యూనిజం ప్రత్యేక సంచికను రూపొందించినట్లు తెలిపారు. ప్రతి కార్యకర్తకు ఈ సంచిక కరదీపికగా ఉపయోగపడుతుందన్నారు. వందేళ్ల పోరాటాల పార్టీని సామాన్య జనానికి చేరువ చేయడం కోసం ఈ సంచికను విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ నాయకత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ. విమల, జీఎస్‌జే అత్యుతరావు, కె. సత్యాంజనేయ, జి. రాంబాబు, కె. సత్యనారాయణ, ఎస్‌కే రెహమాన్, ఆర్.శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, సీఎస్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోర్టులో క్రీడా పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే

విశాఖ స్పోర్ట్స్: విశాఖ పోర్ట్‌లో అంతర్ విభాగాల క్రీడా పోటీలు శుక్రవారం పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక క్రీడా పోటీలు ఉద్యోగులలో శారీరక దారుఢ్యం, స్నేహభావం, సమగ్రతను పెంపొందిస్తాయన్నారు. క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, శరీర సౌష్టవం, చదరంగం, క్యారమ్‌లతో పాటు అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. మెన్, వుమెన్‌తో పాటు దివ్యాంగులకు విభాగాల వారీగా పోటీలు నిర్వహించనుండగా పోర్ట్ ఉద్యోగులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ పోర్ట్స్ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుడు వేణుగోపాల్, వీపీఎస్‌సీ ఉపాధ్యక్షుడు శివకుమార్, విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వేమన సంక్షేమ సంఘం కార్యవర్గానికి అభినందన



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన సంఘం ప్రతినిధులు

సీతమ్మధార: ఇటీవల ఎన్నికైన శ్రీ వేమన సంక్షేమ సంఘం ప్రతినిధులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్‌రెడ్డి అభినందించారు. శుక్రవారం ఓ హోటల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొరుసు మహేశ్వరరెడ్డి, సత్తి నాగేశ్వరరెడ్డి, కార్యవర్గ సభ్యులు దుశ్శాలువతో స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రెడ్డి సంఘం నాయకులు సంఘం సొంత భవనానికి సహకరించాలని కోరారు. సంఘ ఉపాధ్యక్షులు పులగం సూర్యనారాయణరెడ్డి, విజయానందరెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, కర్రి రామారెడ్డి, కోశాధికారి ఎస్. సంజీవరెడ్డి, సంఘ కార్యదర్శులు బైరెడ్డి పోతనరెడ్డి, బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, నీలపు రమణారెడ్డి, డీవీఎస్ ప్రసాదరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలు ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సరైన సమయంలో వైద్య సేవలందించేలా అంబులెన్స్‌ను అపోలో ఆస్పత్రి సిద్ధం చేసింది. దీనిని శుక్రవారం హెల్త్‌సిటీ అపోలో హాస్పిటల్ ఆవరణలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబులెన్స్‌ల ద్వారా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ వైద్య సేవలందించి అందుబాటులో ఉండే ఆస్పత్రులకు తరలిస్తే వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఈ సేవలు అందించడానికి ముందుకొచ్చిన అపోలో యాజమాన్యానికి సీపీ కృతజ్ఞతలు తెలిపారు. మరికొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు ముందుకు రావాలని కోరారు. నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి ఈ అంబులెన్స్ సేవలందిస్తుందని చెప్పారు. అపోలో అంబులెన్స్ కోసం టోల్‌ఫ్రీ నంబర్ 84980 91066కు సంప్రదించాలని సీపీ సూచించారు. కార్యక్రమంలో అపోలో సీవోవో రామచంద్రరావు, వైద్యులు, పోలీస్ అధికారులు ఏడీసీపీ ప్రవీణ్, ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.